క్లుప్తంగా

పాఠశాలల్లో నో బ్యాగ్ డే



కొత్తపేటలో స్కూల్లో తాము గీసిన చిత్రాలతో విద్యార్థులు

రాంబిల్లి : మండలంలో పలు పాఠశాలల్లో శనివారం నో బ్యాగ్ డే నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చిత్రలేఖనం తదితర అంశాలపై తర్ఫీదునిచ్చారు. పలు రకాల ఆటలను ఆడించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఎం. సూర్యారావు మాట్లాడుతూ, ప్రతి నెలా మూడో శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు పలు రకాల అంశాలపై అవగాహన, శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఆందోళన కలిగించిన మంటలు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఎం.జగన్నాథపురం, జగ్గన్నపేట, పల్లపుఆనందపురం గ్రామాల మధ్య ఉన్న పొలాల్లో శుక్రవారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సుమారు 15 ఎకరాల మేర పొలాల్లోని గడ్డి, చెరకు దగ్ధం కావడంతో పరిసర ప్రాంత రైతులు ఆందోళనకు గురై మంటలను ఆర్పేందుకు కృషి చేశారు. వేసవి తీవ్రతతో పాటు, వడగాడ్పుల నేపథ్యంలో పొలాల్లోని గడ్డి ఎండిపోయింది. దీంతో మంటల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని ఆందోళనతో రైతులు పరుగులు తీశారు.మంటలు అదుపులోకి రావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రాము

అచ్యుతాపురం(అనకాపల్లి): వేసవి కాలంలో పనిచేసే ఉపాధి హామీ కూలీలకు టెంట్లు, మంచి నీటి సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము కోరారు.శనివారం ఆయన కొండకర్లలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ గతంలో ఉన్న సౌకర్యాలను ఒక్కొక్కటిగా తొలగిస్తూ ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. ఉపాధి హామీ కూలీల పొట్ట కొట్టే ప్రయత్నాలకు స్వస్తి పలికాలన్నారు.


అభివృద్ధి పనులపై సమీక్ష

పాయకరావుపేట : మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గల స్త్రీ శక్తి భవన్‌లో మండలంలో అభివృద్ధి పనులపై ఎంపీడీవో ఎ.సాంబశివరావు అధికారులతో సమీక్ష నిర్వహించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం ప్రణాళికబద్ధంగా నిర్వహించాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని ప్రతి గ్రామంలోను మొక్కలు నాటే కార్యక్రమానికి సిద్ధంగా ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో, జగనన్న లేఅవుట్లో నెలకొన్న సమస్యలపై సమీక్ష జరిపారు. తహసీల్దార్ కె.జయప్రకాష్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

నాడు-నేడు అభివృద్ధి పనుల పరిశీలన

మునగపాక: నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయని సిరసపల్లి ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు అన్నారు. సిరసపల్లి శివారు రామారాయుడుపేటలో నాడు-నేడు ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. తరగతి గదుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఈ సందర్భంగా సూచించారు. పీఎంసీ చైర్మన్ వీరభద్రరావు, కమిటీ సభ్యుడు బుజ్జి, వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొడ్డేడ జగ్గారావు పాల్గొన్నారు.

భజన బృందాలకు సత్కారం



అమ్మవారి ఆలయంలో భజన చేస్తున్న బృందాలను సత్కరించిన దృశ్యం

పాయకరావుపేట : కుమారపురం గ్రామంలో గల దుర్గాలమ్మ ఆలయంలో భజన చేసిన భక్తులను గ్రామ పెద్దలు సత్కరించినట్టు సమరసత సేవా ఫౌండేషన్ డివిజన్ కన్వీనర్ నీలాపు వెంకటరెడ్డి తెలిపారు. సంవత్సరాలుగా ప్రతి శుక్రవారం ఆలయంలో 2 గంటల పాటు భజన చేస్తున్న బృందాలను శాలువాలు వేసి సత్కరించడం జరిగిందన్నారు. భక్తులందరూ ఎంతో ఉత్సాహంగా అమ్మవారి సేవలో పాల్గొంటున్నారన్నారు.

విద్యార్థులకు బాసటగా జగనన్న ప్రభుత్వం



పెదపల్లిలో జగనన్న విద్యాకానుకలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు



గోకివాడలో జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్న ఎస్‌వీ సూర్యనారాయణ



చీమలాపల్లి పాఠశాలలో జగనన్న విద్యా కానుక పంపిణీ చేస్తున్న దృశ్యం

యలమంచిలి : రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తుందని పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర అన్నారు. శనివారం యలమంచిలి మున్సిపాలిటీ పెదపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలను ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయని, ప్రతి పేద విద్యార్థికి రూపాయి ఖర్చు లేకుండా బ్యాగ్‌లు, పెన్నులు,పుస్తకాలు, యూనిఫార్మ్, బూట్లు సాక్సులు అందజేస్తున్నారని అన్నారు. అలాగే అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి ఎన్నో పథకాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ గల ఉపాధ్యాయులతో అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దుంగా అచ్యుతరావు, మాజీ సర్పంచ్ కోడిగుడ్డు రమణ, ప్రకాష్, శ్రీను పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ

పాయకరావుపేట : మంగవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు సర్పంచ్ సరస్వతీ రామారావు, ఎంపీటీసీ గూటూరు విజయలక్ష్మి రామగోవిందు పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ హైస్కూలు, మండల పరిషత్ పాఠశాలల్లో కూడా విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు పడాల నాని, ప్రధానోపాధ్యాయులు ఎస్.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు

మునగపాక : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తున్నాయని టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి అన్నారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు పనిచేస్తున్నారన్నారు. రామారాయుడుపేటలో శనివారం విద్యార్థులకు ఆమె జగనన్న విద్యాకానుక కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. జగనన్న గోరుముద్ద పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాంబిల్లి : గోకివాడ పాఠశాలలో శనివారం జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్.వి.సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు అల్లవరపు నాగేశ్వరరావు(బాజ్జి) చేతుల మీదుగా విద్యార్థులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యమిస్తుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. బాజ్జి మాట్లాడుతూ, జగనన్న నాడు నేడు పథకంలో పాఠశాలలను అభివృద్ధి చేయడమే గాక జగనన్న విద్యాకానుక కిట్లు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కిట్‌లు అందజేస్తున్న సిరసపల్లి సర్పంచ్ ధనలక్ష్మి

చీమలాపల్లి,నరేంద్రపురంలో..

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న విద్యా కానుక పంపిణీ శనివారం జరిగింది. చీమలాపల్లి మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ సియాద్రి నూకరాజు, ఎంపీటీసీ నగిరెడ్డి నాగేశ్వరరావు చేతుల మీదుగా జగనన్న విద్యా కానుక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ బడుల్లో అన్ని రకాల వసతులు కల్పించడంతో పాటు, విద్యార్థులకు విద్యా కానుక ద్వారా పుస్తకాలు, ఇతర విద్యా సామాగ్రిని అందజేసి గుణాత్మక విద్యను అందిస్తున్నారని తెలిపారు.జగనన్న ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు బాగా చదవి మంచి ర్యాంకులు, ఉన్నత ఉద్యోగాలు సంపాదించాలని ఆకాంక్షించారు. పాఠశాల కమిటీ చైర్మన్ పెయ్యల నాగేశ్ పాల్గొన్నారు.

నరేంద్రపురంలో మల్లవరం సర్పంచ్ పిన్నంరాజు వాసు, ఎంపీటీసీ రావి నాగలక్ష్మి శోభన్‌బాబు చేతుల మీదుగా జగనన్న విద్యా కానుకను అందజేశారు. గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శివ, స్కూల్ కమిటీ చైర్మన్ కిలాడి చినబాబు,చందక బాబ్జి, చందక శేషగిరి, ధూళి బాలకృష్ణ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



బ్యాంక్ మేనేజర్ వంశీని సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు అన్నారు. తోటాడ బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ వంశీ బదిలీ అయిన నేపథ్యంలో శనివారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ అయిదేళ్ల కాలంలో 60 కోట్ల మేర టర్నోవర్ చేయడం గొప్ప విషయమన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించడంలో వంశీ ఎంతో కృషి చేశారన్నారు. మాజీ సర్పంచ్ దాడి వీరమహాలక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మేలు చేసిన ఘనత జగనన్నదే



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : రైతుకు అవసరమైనప్పుడు విత్తనాలు సరఫరా చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద శనివారం అన్నదాతలకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. నాలుగేళ్లుగా ఖరీఫ్, రబీ సీజన్‌లలో సక్రమంగా రైతులకు విత్తనాలు అందించారన్నారు. గ్రామాల వారీగా రైతు భరోసా కేంద్రాలు పెట్టి రైతులకు మరింత సహకారం అందించారన్నారు. గత ప్రభుత్వాల్లో మండల కేంద్రాలకు పరుగులు తీసిన రైతుకు అనుకున్న విత్తనాలు దొరికిన సందర్భాలు లేవన్నారు. ఇప్పుడు రైతు భరోసా కేంద్రానికి వెళ్లి ఏ రకం విత్తనం కావాలో ఎన్ని కావాలో ముందుగా వ్యవసాయ సహాయక సిబ్బందితో నమోదు చేసుకుని ఒకటి రెండు రోజుల్లో విత్తనాలు తీసుకునే అవకాశం కల్పించారన్నారు. నాలుగేళ్లుగా నాట్లు వేసిన ప్రతి రైతుకు పంట చేతికి వచ్చిందన్నారు. రాయితీతో కూడిన విత్తనాలు ప్రతి రైతుకు అందించాలని వ్యవసాయాధికారులకు సూచించారు. కార్యక్రమంలో యలమంచిలి ఏడి రవిప్రకాష్, ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటఉరట్ల, పాయకరావుపేట ఏవోలు సౌజన్య, ఉమాప్రసాద్, సరోజిని, పి.ఆదినారాయణ, ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎస్.రాయవరం జెడ్పీటీసీ కాకర దేవి, ఎంపీపీ లోవలక్ష్మి, మత్స్యకార సంఘం అధ్యక్షుడు గురునాథరావు, సర్పంచ్‌లు వెంకటరమణ, లోవరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, శ్రీపతిరాజు, చంటి, నరసింహమూర్తి, రమణ, నూకునాయుడు, మైలారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకారం



తహసీల్దార్ విజయ్‌కుమార్

ఎస్.రాయవరం : మండల తహసీల్దార్ బి.విజయ్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్ సస్పెన్షన్ కారణంగా గడిచిన మూడు నెలలుగా ఖాళీ ఏర్పడింది. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కుమార్ బాధ్యతలు నిర్వహించారు. ఎట్టకేలకు విశాఖపట్నం జిల్లా కలెక్టరేట్‌లో సెక్షన్ సూపరింటెండెట్‌గా పనిచేసిన విజయ్‌కుమార్ పదోన్నతిపై తహసీల్దార్‌గా నియమితులైనట్టు డీటీ శ్యామ్ కుమార్ చెప్పారు. రెవెన్యూ సిబ్బంది నూతన తహసీల్దార్‌కు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా స్థాయిలో జగనన్న ఆణిముత్యం



డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు చేతుల మీదుగా చెక్ అందుకుంటున్న విద్యార్థిని మరియమ్మ

కోటవురట్ల : మట్టిలో మాణిక్యాలు ప్రతిభతో మెరుస్తున్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆణిముత్యాలుగా నిరూపించుకుంటున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ చదివిన పి.మరియమ్మ అత్యుత్తమ మార్కులతో జగనన్న ఆణిముత్యాలుకు జిల్లా స్థాయిలో పురస్కారం పొందింది. ఈ మేరకు అనకాపల్లిలో శనివారం జరిగిన జగనన్న ఆణిముత్యాల పురస్కార కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి చేతుల మీదుగా రూ.50 వేలు నగదును మరియమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.కొండబాబు మరియమ్మను అభినందించారు. తమ కళాశాలకు కీర్తి తీసుకొచ్చిన మరియమ్మ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

విత్తన శుద్ధిపై అవగాహన అవసరం



విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ఏవో

నక్కపల్లి : రైతులు విత్తన శుద్ధిపై అవగాహన పెంచుకుంటే మేలైన దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ తెలిపారు. శనివారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద వివిధ గ్రామాలకు చెందిన ఆర్‌బీకేల్లో పనిచేసే సిబ్బందికి విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. వరిలో వచ్చే తెగుళ్లకు సూడోమోనాస్ విత్తన శుద్ధి ద్వారా తెగుళ్లను నివారించవచ్చన్నారు. నారుకుళ్లు, అగ్గితెగులు, ఆకుముడత తెగులు పొడ, ఎండుతెగుల నివారణకు సూడోమోనాస్ విత్తన శుద్ధి ద్వారా నివారించవచ్చన్నారు. విత్తనశుద్ధికి 10 గ్రాముల సూడోమోనాస్ పొడిని ఒక కిలో విత్తనానికి కలిపి ఒక రోజు నానబెట్టాలన్నారు. ఎక్కువ నీరు ఉంటే తీసేసి మొలకలు వచ్చినపుడు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి జగనన్నకు చెబుదాం



ఫిర్యాదుదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

మునగపాక : ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్నకు చెబుదాం కార్యక్రమం దోహదపడుతుందని తహసీల్దార్ పి.ప్రకాశరావు అన్నారు. మండల పరిషత్ హాలులో శనివారం సాయంత్రం పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారానికి ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా అర్జీదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అందిన ఫిర్యాదులకు సంబంధించి ఇరువర్గాల నుంచి వివరాలు పరిగణనలోకి తీసుకొని తగు న్యాయం చేస్తామన్నారు. ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ షరీఫ్, ఎంపీడీవో మన్మథరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అతిసార నివారించాలి



మాట్లాడుతున్న ఆయుర్వేదిక్ వైద్యురాలు సుజాత

ఎస్.రాయవరం : అతిసార ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ ఇన్‌ఛార్జి ఆయుర్వేదిక్ వైద్యులు సుజాత సూచించారు. అతిసార నియంత్రణ పక్షోత్సవాలు ముగింపు సందర్భంగా పీహెచ్‌సీ వద్ద సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సుజాత మాట్లాడుతూ అతిసార ప్రబలిన సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాంతకమయ్యే ప్రమాదం ఉందన్నారు. వేసవిలో కలుషిత నీటిని తీసుకున్నవారిలో ఎక్కువగా ప్రబలుతుందన్నారు. కాగా పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు ఉన్నప్పటికీ పీహెచ్‌సీ పరిధిలో ఒక్కరు కూడా కార్యక్రమానికి హాజరు కాకపోవడం విశేషం. ఇరువురు వచ్చినట్టు హాజరు పట్టీలో మాత్రం హాజరు ఉంది. కార్యక్రమంలో మలేరియా ఇన్‌ఛార్జి నోడల్ అధికారి ప్రసాద్, సచివాలయ హెల్త్ సెక్రటరీ రాజేశ్వరి, స్టాఫ్ నర్స్ వెంకట్, ల్యాబ్ టెక్నీషియన్ ఇందల హరి, ఎఫ్‌ఎన్‌వో హారిక పాల్గొన్నారు.